# మనస్సు కావాలి

## అరిగె రామారావు

రోజూలాగే తెల్లవారింది. రోజూలాగే ఎండకాస్తోంది. రోజూలాగే అప్పుడు టైం ఎనిమిదింబావు కావస్తోంది. రోజూలాగే వెంకటాపురం కాలనీ బస్‌టర్మినెస్‌లో జనం గుంపులు గుంపులుగా నిలబడి వున్నారు. రోజూలాగే ఆ జనంలో ఆఫీసులకుపోయే వుద్యోగస్థులూ, స్కూళ్ల టీచర్లూ, స్కూళ్లకుపోయే బాలబాలికలూ కాలేజీ స్టూడెంట్స్ ఉన్నారు. రోజూలాగే వీళ్లందరూ సికిందరాబాద్ స్టేషన్‌కుపోయే ఏయిట్‌థర్టీ (ఎనిమిదన్నర గంటలకెళ్లే) ట్వంటీవన్ నెంబర్ బస్సుకోసం ఎదురు చూస్తోన్నారు...

అంతా రోజూలాగే వుంది. కాని, ఇవ్వాళ్టిలో ఒక ప్రత్యేకత ఉంది. ఇవ్వాళ కాసే ఎండలో ఒక ఆహ్లాదత వుంది. ఇవ్వాళ ట్వంటీవన్ నెంబర్ బస్సు కోసం అక్కడ వెయిట్ చేస్తోన్న యావన్మంది మొగాల్లోనూ ఒకే రకమైన ఆసక్తీ వుత్సాహాలూ ద్యోతకమౌతున్నాయి. వాళ్లమొగాల్లో రోజూలాగా మామూలు 'రొటీన్‌లుక్స్' లేవు. ఒక ప్రత్యేకమైన 'ఫెస్టివ్‌లుక్స్' వున్నాయి. వాళ్ల చేతుల్లో రోజూ వుండే రొటీన్ సామగ్రి ఆఫీసు బ్యాగులూ, టిఫిన్‌బాక్సులూ, వాటర్ బోటిల్సూ గ్రాయే కాకుండా పూలమాలా పుష్పగుచ్ఛం, స్వీట్‌పాకెట్లూ కూడా వున్నాయి. ఒకరిద్దరు చేతుల్లో కెమెరాలు కూడా వున్నాయి.

అక్కడున్న యావన్మందీ చూపులూ, మాటలూ చేతల్నిబట్టి ఇవ్వాళ ఆ సమయంలో అక్కడేదో స్పెషల్ ఈవెంట్ జరగ్గబోయే సూచనలు కనిపిస్తోన్నాయి. జగదీష్ అనబడే పాతికేళ్ల యువకుడు అక్కడున్న అందర్లోకి కూడా బిజీగా వున్నాడు. అక్కడ జరగబోయే ఫంక్షన్‌కు అతడే ఆర్గనైజర్‌లాగా కనబడుతున్నాడు. ఏయిట్ థర్టీ ట్వంటీవన్ నెంబర్ బస్సు రాగానే చేయ వల్సిన కార్యక్రమం గురించి తనకంటే వయస్సులో పెద్దవాళ్లతో చర్చించి వాళ్ల సలహాలు తీసుకుంటున్నాడు. కెమెరాలు తెచ్చిన వాళ్లలో ఏ సందర్భంలో స్నేప్స్ కొట్టాలో సూచనలిస్తోన్నాడు. మాటమాటికి టైం చూచుకుంటున్నాడు. అందరితో వుత్సాహంగా నవ్వుతూ మాట్లాడుతున్నాడు. ఇలాటి క్రొత్తరకమైన ఫంక్షన్ని ఆర్గనైజ్ చేస్తోన్నందుకు అందరూ అతడ్ని అభినందిస్తోన్నారు.

జగదీష్ సికిందరాబాద్‌లో ఏదో ప్రైవేట్ కంపెనీలో వుద్యోగం చేస్తోన్నాడు. అందరితో కలుపుగోలుగా వుంటాడు. రోజూ ఏయిట్‌థర్టీ బస్సులో రెగ్యులర్‌గా ప్రయాణంచేసే తోటి పాసింజర్స్‌ను పెద్దా చిన్నా ఆంధ్రా మద్రాసీ, తెలుగూ, ఉర్దూ అనే తారతమ్యం లేకుండా అందర్నీ పలకరిస్తాడు. తాను నవ్వుతూ అందర్నీ నవ్విస్తుంటాడు. ఇంతలోకి ఏయిట్‌థర్టీ బస్సు రానేవచ్చింది. అది అంతదూరంలో 'దర్గా' దగ్గర సైటివ్వగానే ఇక్కడ జనంలో కలకలం బయలుదేరింది. అంతా ఒక్కచోట గుమిగూడారు.

ట్వంటీవన్ దగ్గరకు రాగానే డ్రైవరు యాదగిరిని చూచి అందరూ వుత్సాహంగా చేతులూపారు. యాదగిరి కూడా తిరిగి చెయ్యివూపాడు వుషారుగా.

బస్సు హారన్‌కొట్టి వచ్చి ఆగింది. కేబిన్‌లోంచి యాదగిరి క్రిందకు దిగాడు. జనం అంతా అతని చుట్టూ మూగారు. ఇవ్వాళ అతడు నూతనవస్త్రాలు ధరించి నీట్‌గా క్రొత్తపెళ్లి కొడుకులాగా వున్నాడు.

"ఆజ్ హమారే డ్రైవర్‌సాబ్ బహుత్ యంగ్ దిక్‌రహాహై!" అని ఎవరో అన్నారు. ఆమాటకు అందరూ బిగ్గరగా నవ్వేరు. యాదగిరి కూడా నోరారా నవ్వాడు.

ఈ రోజు యాదగిరి సర్వీసులోంచి రిటైరవుతున్నాడు. ట్వంటీవన్ నెంబర్ బస్సు ఎయిట్‌థర్టీ ట్రిప్‌కు డ్రైవ్‌చెయ్యడం అతనికిది ఆఖరిరోజు. నైజాం గవర్నమెంట్ కాలం నుంచీ అతడు ఆర్టీసీలో డ్రైవరుగా పనిచేస్తోన్నాడు. వలభైసంవత్సరాల సర్వీసు పూర్తిచేశాడు.

గత పదేళ్లుగా వెంకటాపురం రూట్‌లో బస్సు నడుపుతున్నాడు. ట్వంటీవన్ నెంబర్ బస్సు (ఎయిట్‌థర్టీ ట్రిప్‌కు) డ్రైవరుగా రెగ్యులర్‌గా వస్తోన్నాడు. ఎంతో క్రమశిక్షణతో తనవిధి నిర్వహిస్తోన్నాడు. ఎంత వర్షంరానీ వరదరానీ వుదయం ఎనిమిదీ ఇరవై నిమిషాలకల్లా ఠంచన్‌గా ట్వంటీవన్ నెంబర్‌బస్సును వెంకటాపు రం బస్సు టర్మినెస్‌లోకి తెచ్చి ఆపుతాడు. ఎనిమిదిన్నరవటం ఆలశ్యం టక్కున బస్సును స్టార్టుచేస్తాడు. నిర్ణీత స్టేజీల్లో ఆపుతూ ఆఫీసులకెళ్లే వాళ్లనూ, స్కూళ్లకెళ్లే చిన్నచిన్నపిల్లలనూ, కాలేజీలకెళ్లే స్టూడెంట్స్‌నూ సికిందరాబాద్ స్టేషన్ కెళ్లేవాళ్లనూ టైంలోపల వాళ్లవాళ్ల గమ్యాలకు సక్రమంగా క్షేమంగా జేరవేస్తాడు.

దుమ్మాలుకొట్టి కండక్టర్లు మారినా ఎయిట్‌థర్టీ ట్రిప్పుకు అతడు మాత్రం మారడు. అనవసరంగా లీవులుపెట్టడు. డ్యూటీలు ఎగగొట్టడు. వీక్లీఆఫ్ కూడా ఆదివారం వాడే తీసుకుంటాడు. ఏ బస్సన్నా కేన్సిల్ అవుతుందేమోగాని యాదగిరి ఎయిట్‌థర్టీ బస్సు మాత్రం కేన్సిల్‌కాదు. ఫంక్చుయాల్టీ మెయిన్‌టేన్ చేస్తాడు. అతడి బస్సు లేట్ రన్నింగ్ వుండదు.

ఈ కారణాలవల్ల వెంకటాపురం కాలనీ వాసులందరికీ ముఖ్యంగా ఆఫీస్ గోయర్స్ మరియు స్టూడెంట్స్‌కు యాదగిరి ఆప్తుడైపోయాడు. రోజువారీగా తన బస్సులో ఎక్కేవాళ్ళ మొగాలన్నీ అతడికి బాగా గుర్తు. ఎవరు ఏ స్టేజీలో ఎక్కుతారో, ఏ స్టేజీల్లో దిగుతారో అతనికి బాగా తెలుసు. స్టీరింగుముందు కూర్చొనే తెల్సిన పాసింజెర్లను చూచి నిండుగానవ్వుతూ చెయ్యివూపి విష్‌చేస్తాడు. ఆడవాళ్లూ, పిల్లలూ ఎక్కేవరకు దిగేవరకు బస్సు ఆపుచేస్తాడు. మిగతా డ్రైవర్లులాగా ఆగకుండా అదిరిపాటుగా బస్సును లాగించడు. తెల్సిన మొగాలు కనిపిస్తే స్టేజీకాకపోయినా సరే బ్రేక్‌మీద కాలేసి స్లోచేస్తాడు.

ఈ విధంగా యాదగిరికీ, ఆ కాలనీ కమ్యూటర్స్‌కీ మధ్యన ఒకవిధమైన ఆత్మీయత వుంది. ఈరోజుతో అతడు రిటైరవబోవటం వీళ్లందరికీ ఒకవిధంగా బాధాకరంగా ఉంది. అయినా తప్పదు కాబట్టి ఈ సందర్భంలో అతడ్ని సాదరంగా సన్మానించి సత్కరించాలని వీళ్లంతా నిర్ణయించుకున్నారు. ఈ ఐడియా, ఈ ఆర్గనైజేషన్ అంతా జగదీష్‌దే. వారం రోజుల క్రితమే అందర దగ్గర్నుంచీ చందాలు వసూలుచేశాడు.

"ఛలో జగదీష్, కాం షురూ కరో!" చీఫ్ ఇంజనీరు ఆఫీసులో ఆఫీసరుగా పనిచేస్తోన్న రాజారావుగారు అన్నారు. ఆ తర్వాత జరగవల్సిన కార్యక్రమమంతా చకచకా జరిగిపోయింది.

జగదీష్ "ఆయియే డ్రైవర్‌సాబ్!" అని సిగ్గుపడుతున్న యాదగిరిని ఆప్యాయంగా చెయ్యిపట్టుకొని తీసికొచ్చి బస్సుముందు నిలబెట్టాడు. ఒకామె ముందుగా యాదగిరికి కుంకుమబొట్టు పెట్టింది. మిగతావాళ్లు కూడా అతడికి బొట్లుపెట్టారు.


స్టేట్‌బ్యాంక్‌లో క్యాషియర్ పిళ్లేగారి చేతికి పూలమాల ఇచ్చి "మాలా దాలియే!" అన్నాడు జగదీష్. పిళ్లేగారు పూలమాలను యాదగిరిమెళ్లో వేశారు. అందరూ చప్పట్లుకొట్టారు. స్కూలుపిల్లలంతా పూలగుచ్ఛాలు అతని చేతికిచ్చారు. అతని కళ్లనుంచి ఆనందభాష్పాలు జాలువారాయి. ఫోటోస్నేప్స్ అవసరమైనప్పుడల్లా తీశారు. భుజానికి తగిలించుకున్న సంచిలోంచి జగదీష్ గిఫ్ట్‌కేక్ బయటికి తీశాడు. అందులో అందమైన గోడగడియారం వుంది. దాన్ని పైకెత్తి పట్టుకొని అందరికీ చూపించాడు. స్కూలు హెడ్‌మిస్ట్రస్ అరుంధతమ్మగారి చేత దాన్ని తమ అందరి తరపునా యాదగిరికి కానుకగా ఇప్పించాడు.

దుమ్మాలుకొట్టి కండక్టర్లు మారినా ఎయిట్‌థర్టీ ట్రిప్పుకు అతడు మాత్రం మారడు. అనవసరంగా లీవులు పెట్టడు. డ్యూటీలు ఎగ్గొట్టడు. వీక్లీ ఆఫ్ కూడా ఆదివారంనాడే తీసుకుంటాడు. అతడి బస్సు లేట్ రన్నింగ్ ఉండదు.

యాదగిరిని మధ్యలో పెట్టుకొని అందరూ బస్సుముందు నిలబడి ఫోటో దిగారు.

యాదగిరి ముకుళితహస్తాలతో అందరికీ నమస్కరించి తన కృతజ్ఞతను వెల్లడించుకున్నాడు.

బస్సు బయలుదేరింది. బస్సులోపల రోజూలాగే



తొడతొక్కిడిగా వుంది. జగదీష్ మరో కాలేజి స్టూడెంట్ కలిపి బస్సులో అందరికీ స్వీట్‌పాకిట్స్ పంచిపెట్టారు. అందరూ జోక్‌లేసుకుంటూ డ్రైవర్ని ప్రశంసిస్తూ ఆ కాసేపు సరదాగా గడిపారు.

పికెట్ దగ్గర కొందరూ, పేట్నీ దగ్గర మరికొందరు దిగిపోయారు. జగదీష్ కూడా పేట్నీలో దిగాడు. దిగిపోయిన వాళ్లందరూ చేతులూపి చివరిసారిగా యాదగిరికి తమ వీడ్కోలు తెలిపారు.

జగదీష్ మిగిలిపోయిన అయిదారు స్వీట్ పాకిట్స్ యాదగిరికిచ్చాడు. "ఇందాక ఇచ్చావుగా జగదీష్‌సాబ్! మళ్లీ ఎందుకయ్యా?" అన్నాడు. "తినవయ్యా! మునవలోళ్లకు తీపి అంటే ఇష్టం!" అన్నాడు. యాదగిరి, "ఆప్‌కా మెహర్బానీ!" అంటూ ఎంతో కృతజ్ఞతతో వాట్ని తీసుకున్నాడు. మళ్లీ "వుంటా జగదీష్‌సాబ్! ఈ మునలోడిమీద దయవుంచు!" అంటూ చెయ్యికలిపాడు. అప్పుడతనికి కృతజ్ఞతాపూర్వకమైన

దుఃఖంతో గొంతుపూడుకుపోయింది. జగదీష్‌క్కూడా కళ్లనీళ్ల పర్యంతమైంది... బరువెక్కిన మనస్సుతో భారంగా అడుగులేసుకుంటూ ఆర్.పి.రోడ్డులో వున్న తమ ఆఫీసుకేసి సాగిపోయాడు.

యాదగిరికి ఇందాక శాశ్వతంగా వీడ్కోలు చెప్తుంటే ఎందుకో అతని మొగంలో జగదీష్‌కు తన తండ్రి రూపమే కనిపించింది. తన తండ్రి కూడా యాదగిరిలాగే ముప్పై అయిదు సంవత్సరాలుపైగా ఆల్విన్ కంపెనీలో సామాన్య కార్మికుడుగా పనిచేసి అయిదేళ్ల క్రితమే రిటైరయ్యాడు. ఆయనకిప్పుడు అరవైఅయిదేళ్లు. కళ్లు సరిగ్గా కనిపించవు. బాత్‌రూంకు వెళ్లాలన్నా లెట్రిన్‌కు వెళ్లాలన్నా ఎవరైనా చెయ్యిపట్టు కొని తీసికెళ్లాలి. తన భార్యో, తన పిల్లలో తీసికెళ్లాలి. తన తల్లి ఎప్పుడో చనిపోయింది. కాబట్టి ప్రతిదానికీ ఆయన తన భార్యాపిల్లల మీదే ఆధారపడాలి! వాళ్లు ఆయన మీద పూరికే విసుక్కుంటారు. అయినదానికీ కానిదానికీ అనవసరంగా కసురుకుంటారు. చెయ్యి పట్టు

కొని గుంజుకుపోతారు. పూరిదే తెచ్చుతారు. ఆయన ''అరేయ్ పిన్నోడా, రెండ్లు స్వీట్రా!'' అని తనను ఫిర్యాదుచేస్తాడు. దాన్తో తన భార్య మునలాయన మీద గయ్‌గయ్‌మని లేస్తుంది. ఇంట్లో రోజూ ఇదే గొడవ! తాను కూడా తండ్రిమీదే విసుక్కుంటాడు.

జగదీష్ ఆఫీసులో తన సీట్లో కూర్చున్నాడన్నమాటేగాని ఆఫీసు పనిమీద మనస్సు లగ్నం చెయ్యలేకపోతున్నాడు. మాటిమాటికి తన తండ్రే గుర్తుకువస్తోన్నాడు. తన తండ్రికి తీపి పదార్థాలన్నా చిరుతిళ్లన్నా తగని ఇష్టం. మొగం వాచిపోతాడు. తన పిల్లల దగ్గర ఆశగా చెయ్యిచాపుతాడు. వాళ్లు వెదిరించికొట్టుతారు. తాను మాటీమాడనట్లు వూరుకుంటాడు. తన భార్య ఆయనకు ఏం పెడుతుందో, ఏం పెట్టటంలేదో తానేనాడూ ఆయన ఆలనాపాలనా కనుక్కోలేదు. ఈ మధ్యన తన పెద్దక్కయ్య పట్నం మాపుగా వచ్చింది. ముసలి తండ్రిని సరిగ్గా చూడ్డంలేదని తనమీదా తన భార్యమీదా పోట్లాడి ఆయన్ని తనవెంట వాళ్లూరికి తీసుకుపోయింది. ఆయన ఏడ్చుకుంటూ పోయాడు.

యాదగిరి తన డ్యూటీని తాను సక్రమంగా బాధ్యతాయుతంగా చేసుకుంటూ తద్వారా తమ కాలనీ వాసులందరికీ ఎంతో సేవచేశాడని కృతజ్ఞతాపూర్వకంగా ఇవ్వాళ అతడ్ని సత్కరించార్ట ఇందులో తాను ప్రధానపాత్ర వహించాడు. మరి తన తండ్రి కూడా యాదగిరిలాగే క్రమశిక్షణతో నలభైసంవత్సరాల సర్వీసు చేశాడు. తన కుటుంబానికీ తన సంతానానికీ తాను చెయ్యవల్సిన డ్యూటీని సక్రమంగా నెరవేర్చాడు. ఆయన ఏం తిన్నాడో, ఏం తిన్లేదో తెలియదు. ఈ నలభై సంవత్సరాలూ ఇంత సంసారాన్ని కష్టపడి ఈడుకొచ్చాడు. అప్పులే చేశాడో, తప్పులే చేశాడో ఆడపిల్లలకు పెళ్లిళ్లుచేశాడు. ఒక్కడే మొగపిల్లవాడని తనను గారాబంగా పెంచాడు. బియ్యేదాకా చదివించాడు. తన తండ్రి కూడా తన డ్యూటీని తాను సక్రమంగా చేశాడు కదా మరి ఆయన్ని ఎవరు సన్మానించి సత్కరించారు? ఎవరోదాకా ఎందుకు కన్నకొడుకుగా తానేం చేశాడు? సత్కారాలకు బదులు ఇంట్లో రోజూ ఆయనకు ఛీత్కారాలు! ఇందులో కన్నకొడుకుగా తన పాత్ర ఏంటి? ఇందాక యాదగిరి వద్దంటున్నా తాను బలవంతంగా స్వీట్‌పాకెట్స్ ఇచ్చాడు. మరి తన తండ్రికేనాడయినా ఇది తిను నాన్నా! అని బజార్నుంచి తీసికొచ్చి ఏదైనా చేతిలోపెట్టాడా? ఆయన మంచీచెడ్డా చూశాడా? నలభై సంవత్సరాలుగా నిర్విరామంగా తమ కుటుంబానికి ఆయన చేసిన సేవకు కొడుకుగా తాన్జేసిన ప్రతిసేవేంటి? ఆయన్ని ఏవిధంగా సత్కరించాడు?

ఆ రోజంతా జగదీష్ మనస్సు మనస్సులో లేదు. వికలమైపోయింది. తన మనఃసాక్షిముందు సిగ్గుతో తలవంచాడు! తనతప్పు తాను తెలుసుకున్నాడు.

ఆ సాయంత్రం ఆఫీసు అవగానే తన తండ్రికిష్టమైన నాలుగురకాల స్వీట్స్ కొనుక్కొని సంగారెడ్డి బస్సు ఎక్కాడు. తన అక్కయ్య దగ్గర వుంటున్న తండ్రిని తిరిగి తీసికొనిరావటానికి.



**జవాబు**

ఇంటర్వ్యూలో ప్రశ్నించాడు అధికారి.

''నువ్వు పోస్టుమాన్ వుద్యోగంలో చేరడానికి బలమైన కారణం ఏమైనా వుందా?''

''వుందిసార్. ఈ కరువు రోజుల్లో ఎన్ని పుస్తకాలని కొంటాం చెప్పండి.''

కె.ఎస్.ఎం (తాళ్లపూడి)

మాడాలేగాని మన దైనందిక జీవితాల్లో రోజూ జరిగే మామూలు సంఘటనల్లో కూడా ఏదో ఒక నీతి నిగూఢంగా వుంటుంది! దాన్ని గ్రహించి మన తప్పొప్పులను తెలుసుకోవచ్చు. మన నడవడ్ని సరిదిద్దుకోవచ్చు. కావల్సిందల్లా మనస్సే! *


Lin Kuie



- If you understand that the need of the day, is a Martial Art which can save your life and honour..........
- If you wish to discover and use the hidden realms of power, of your mind and body, to live a fearless and fruitful life..........
- If you wish to go beyond the trivialities of ego boosting sport oriented Martial Arts..........

Then here is a rare opportunity to learn and experience the ultimate, invincible, mystic warrior heritage of the ancient LIN KUIE (Chinese Ninja)

**The Top secret unarmed and weapons techniques of LIN KUIE, taught for the first time in India, by Hong Kong trained, authorised, licensed, Senior Chief Instructor.**

Personal, intensive instructor's training available only to select, genuinely interested Black belts, Brown belts and others with a minimum of two years of Martial Arts training, in any style.

For prospectus, application form write about yourself, with a photostat copy of Belt or Rank Certificate to :

Black Dragon Lin Kuie Society

20/228, Bethavolu,
GUDIVADA - 521 301.
Andhra Pradesh.

శ్రీ మహాలక్ష్మి వారి
వెరైటీ నవలలు వెలువడినవి!

శ్రీమతి
యద్దనపూడి సులోచనారాణి
డైరెక్ట్ నవల
నిశాంత రూ.25/-
ప్రమాదాల్లో ప్రమదలు - నవీన్
(స్వాతి వీక్లీ సీరియల్) రూ.30/-
అన్వేషణ - వి.యస్.రావు
(అపన సీరియల్) రూ.20/-
మానసిక సమస్యలు-
సమాధానాలు - డా॥ ఇండ్ల రామసుబ్బారెడ్డి
(స్వాతి మంత్లీ నుండి) రూ.20/-

Ph: 63322
శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్
మ్యూజియం రోడ్, విజయవాడ-2

అడ్వాన్సుతోపాటు మీ ఆర్డర్స్ పంపండి!